క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ

మునగపాక: మండలంలోని రెండు గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటిపల్లి పంచాయతీలో రాత్రి 7 గంటలకు, మూలపేటలో రాత్రి 8 గంటలకు జరిగే రచ్చబండ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా పసలమారమ్మ పండగ



ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: పసలమారమ్మ పండగ ఆదివారం మునగపాకలో ఘనంగా జరిగింది. ఇక్కడ అయిదు మదుంల జంక్షన్ దరి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వార్డు సభ్యులు పెంటకోట సత్యనారాయణతో పాటు పసలమారమ్మ మూల సంఘ రైతులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంఘ అధ్యక్షునిగా రమణబాబు

మునగపాక: స్థానిక పసలమారమ్మ మూల సంఘ నూతన కార్యవర్గం ఆదివారం ఎంపికైంది. తోటాడ, మునగపాక రెవెన్యూ పరిధిలోని సబ్ స్టేషన్ వరకు భూములున్న రైతులతో కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కొయిలాడ రమణబాబు, కార్యదర్శిగా కాండ్రేగుల రమణబాబు, కోశాధికారిగా ఆళ్ల జగ్గప్పారావు, సభ్యులుగా మొల్లేటి వెంకటప్పారావు, భీశెట్టి రమణ తదితరులు ఎన్నికయ్యారు. సంఘ అభివృద్ధికి పాటుపడడంతో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు.

ఎడతెరిపి లేని వాన..!



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షం నీరు

కోటవురట్ల: అల్పపీడన ప్రభావంతో వరుణుడు తగ్గేదే లేదన్నాడు. వాతావరణంలో తీవ్ర మార్పు చోటు చేసుకోవడంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిలో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చాలా కాలంగా ఇక్కడ సమస్య తిష్టవేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే గ్రామీణ రహదారుల సంగతేంటని ప్రశ్నిస్తున్నారు.

స్త్రీశక్తి పథకానికి వ్యతిరేకంగా ఆటో డ్రైవర్ల ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

పాయకరావుపేట: మండలంలో ఆటో డ్రైవర్లు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం మహిళలు కల్పించిన ఉచిత బస్సు(స్త్రీశక్తి పథకం) ప్రయాణానికి నిరసనగా ర్యాలీ నిర్వహించారు. దుర్గా ఉషోదయ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పెంటకోట, మంగవరం, సత్యవరం, రేబాక, ముకుందరాజుపేట, బంగారయ్యపేట, తదితర గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. పట్టణ మెయిన్‌రోడ్డులో ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల తమకు ఆదాయం తగ్గిపోయిందని వాపోయారు. తద్వారా జీవనోపాధి ఎంతో కష్టంగా ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణ విధానం రద్దు చేసి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

నేడు ఓల్డ్ ఐటీఐలో అప్రంటిస్‌షిప్ మేళా


కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థుల కోసం కంచరపాలెంలోని విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2025 నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్–1 ఉప సంచాలకుడు ఆర్ వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్‌యార్డ్, ఆలిండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ కంపెనీలతోపాటు 12కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

చీడిక జలాశయంపై శీతకన్ను

- పూడిక తీతకు నోచుకోని కాలువలు
- పంటలకు అందని సాగునీరు
- గట్లుపై పెరిగిన భారీ వృక్షాలు
- పట్టించుకోని కూటమి పాలకులు



చీడిక జలాశయం



ఎంపీటీసీ నిధులతో మరమ్మతులు చేయించిన షట్టర్లు



జలాశయం గట్టుపై పెరిగిన భారీ వృక్షాలను తొలగిస్తున్న రైతులు

నక్కపల్లి: జలాశయంలో పుష్కలంగా నీరుంటే రైతుల్లో దరహాసం.. పంటల సాగుకు ఢోకా ఉండదని ధీమాగా ఉంటారు. కానీ మండలంలో మెరక గ్రామాల్లో మెట్ట భూములకు సాగునీరు అందించే చీడిక చీడిక జలాశయంలో నీరున్నా ఆనందం కానరాలేదు. ఏళ్ల తరబడి పాలకులు పట్టించుకోకపోవడంతో జలాశయ గర్భం పూడిపోయింది. గట్లపై భారీ వృక్షాలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. ఎప్పటికప్పుడు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టకపోవడంతో జలాశయ గట్టు కాకులు దూరని కారడవులా తయారైంది. జలాశయం వద్దకు వెళ్లే మార్గాలు సైతం మూసుకుపోయాయి.

నలభై ఏళ్ల క్రితం మెరక గ్రామాల్లో సాగునీటి అవసరాల కోసం చీడికలో 50 ఎకరాల విస్తీర్ణంలో జలాశయం నిర్మించారు. దీని కింద చీడిక, దోసలపాడు, జగన్నాథపురం, రమణయ్యపేట, గుల్లిపాడు, ముకుందరాజుపేట, డొంకాడ, కొత్తూరు గ్రామాలకు చెందిన 800 ఎకరాల మెట్ట భూములు సాగు చేస్తుంటారు. వరితోపాటు ఎక్కువగా మామిడి, జీడి, ఉద్యానవన పంటలు, కూరగాయలు పండిస్తారు. ఇవి పూర్తి వర్షాధారమైనవి కావడంతో చీడిక రిజర్వాయరు నీటితో సాగు చేస్తుంటారు. ఈ జలాశయానికి అనుబంధంగా నిర్మించిన కాలువల ద్వారా దిగువ ప్రాంతాల్లో పలు చెరువుల్లోకి సైతం నీరు చేరేది. అటువంటి జలాశయం కొన్నేళ్లుగా నిరాదరణకు గురైంది. జలాశయంలో నీళ్లున్నప్పటికీ ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. జలాశయం నీటిపై ఆధారపడకుండా వర్షాధారంతో రైతులు సాగు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఆయకట్టు గ్రామాల రైతులకు కరెంటు సదుపాయం కూడా లేదు. దీంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని బోర్లుకు విద్యుత్ సరఫరా చేసుకుంటూ పంటలు పండిస్తున్నారు.

నీరు రాక బొప్పాయి రైతుల ఆందోళన

మండలంలో బొప్పాయి అధికంగా జలాశయ పరిసరాల్లో పండిస్తున్నారు. దిగుబడి, మంచి ఆదాయం లభించే ఈ పంటకు సరైన నీటి సదుపాయం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడిన సందర్భంలో రిజర్వాయర్‌లో భారీగానే నీరు చేరుతుంది. జలాశయానికి ఉన్న కాలువలు పూడిక తీతకు నోచుకోలేదు. పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో కాలువలు కనుమరుగయ్యాయి. గట్టు కూడా పటిష్టంగా లేకపోవడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. జలాశయానికి ఏర్పాటు చేసిన షట్టర్లు తుప్పుపట్టి పాడయ్యాయి.

రైతులే చెట్లను తొలగిస్తున్నారు



చీడిక జలాశయాన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. గట్టుపై భారీ వృక్షాలు పెరిగాయి. గట్టుపై అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితుల్లో రైతులే చెట్లను తొలగించే పనులు ప్రారంభించారు. కాలువల్లో పూడిక తీత చేయలేదు. నీరంతా జలాశయంలోనే ఉండిపోతోంది. ఉపాధి హామీ నిధులు కేటాయించి జలాశయాన్ని పూర్తిగా బాగు చేయించాలి. ఇటీవలే డొంకాడ ఎంపీటీసీ గ్రాంటు నుంచి రూ.2.50 లక్షలు షట్టర్ల మరమ్మతుల కోసం మంజూరు చేశారు. ఈ నిధులు ఏ మూలకూ సరిపోవు. రూ.20 లక్షలు కేటాయిస్తే తప్ప పూర్తిగా అందు బాటులోకి రాదు.

– కరణం ఈశ్వరరావు, రైతు
జగన్నాథపురం

పట్టించుకోని సాగు నీటి సంఘాలు..

కూటమి ప్రభుత్వం వచ్చాక నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్‌ను, సభ్యులను నియమించినప్పటికీ ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు. జలాశయం సమస్యలు తెలుసుకున్న వైస్ ఎంపీపీ వీసం నానాజీ తన ఎంపీటీసీ గ్రాంట్ నుంచి రూ.2.50 లక్షలు కేటాయించడంతో అత్యవసరమైన షట్టర్లు మరమ్మతులు కొద్దిగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ముందుగా జలాశయం చుట్టూ గట్లపై భారీ వృక్షాలను తొలగించాలని, కాలువల్లో పిచ్చితుప్పలు తొలగించి పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులే శ్రమదానం చేస్తూ గట్లపై వృక్షాలను తొలగించే పనులు చేపడుతున్నారు. కాలువలకు పూడికతీత చేయకపోవడం వల్ల నీరంతా జలాశయంలోనే నిల్వ ఉండిపోతోంది. దిగువ ప్రాంతాలకు రావడం లేదు.

వెంకన్న ఆలయానికి విరాళం



ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. రూ.5 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం మునగపాకలోని శ్రీ సిటీ లే–అవుట్ నిర్వాహకులు ఎంబీవీకే నాయుడు, బాబ్జినాయుడు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, ఆడారి గోపి, పెంటకోట సూర్యనారాయణ, దిమ్మల శివ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి



సత్యవతి

మునగపాక: స్థానిక అంగన్‌వాడీ టీచర్ విల్లూరి సత్యవతి(41) గుండెపోటుతో మృతి చెందింది. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేసేవారు. 11 నెలల క్రితం పదోన్నతిలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తగా సేవలందిస్తోంది. శనివారం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునగపాకలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు హాజరైంది. తిరుగు ప్రయాణంలో వినాయక ఊరేగింపును తిలకిస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురవడంతో కుటుంబ సభ్యులు ఆమెను అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. సత్యవతి అంత్యక్రియలు ఆదివారం మునగపాకలో నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నివాళులర్పించారు.

‘అన్నదాత పోరు’ను విజయవంతం చేయండి

- అచ్చెన్నాయుడుకు మంత్రిగా కొనసాగే అర్హత లేదు
- సమన్వయకర్త కంబాల జోగులు



అడ్డురోడ్డులో అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంబాల జోగులు

నక్కపల్లి/ఎస్.రాయవరం: అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు ఈ నెల 9న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. ఆదివారం అడ్డురోడ్డులో ఆయన క్యాంపు కార్యాలయంలో అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. ఉచిత పంటల బీమా అందరికి వర్తింపజేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారన్నారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. రైతు సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రికి పట్టడం లేదన్నారు. ఎరువుల కోసం రైతులు క్యూలో నిల్చొంటే బఫే మీల్స్ కోసం అంటూ పోల్చిన అచ్చెన్నాయుడు వ్యవసాయ మంత్రిగా పనికిరాడన్నారు. రైతులను అవమానపరచిన వ్యవసాయ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. రైతులు ఇబ్బందుల్లో ఉంటే అయనకు భోజనం గుర్తుకు రావడం సిగ్గుచేటన్నారు. రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల్లో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు మిగిలిన ఎరువులు ప్రైవేటుకు కేటాయిస్తారని, కాని ప్రభుత్వం మాత్రం మార్క్‌ఫెడ్‌కు కేటాయించిన ఎరువుల్లో కోత విధించిందన్నారు. ప్రైవేటుకు ఇచ్చిన యూరియా బ్లాక్ చేసి రూ.270కి విక్రయించాల్సిన యూరియా రూ.450లకు విక్రయిస్తున్నారన్నారు. రెట్టింపు ధరలకు విక్రయించిన యూరియా సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్తుందో చెప్పాలన్నారు. టీడీపీ వాళ్లు ఎరువులను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని, వ్యవసాయం మానేసి ఆవులను మేపుకోవాలని చంద్రబాబు వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం పూర్తిగా ఇవ్వలేదన్నారు. రైతులకు ప్రభుత్వం రూ.40 వేలు బాకీ పడిందన్నారు. ఈ పథకం అమలు చేయడంలో మోసం చేసిందన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ ఇవ్వలేదన్నారు. చంద్రబాబుకు ఓటేస్తే భవిష్యత్ గ్యారంటీ అన్నారని, రైతుకు ఒక్క యూరియా బస్తా ఇవ్వలేకపోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు, యూరియాను ఖరీఫ్‌కు ముందే సిద్ధం చేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే అందించడం జరిగేదన్నారు. ఇప్పుడు ఆ కేంద్రాలను నాశనం చేశారన్నారు. కార్యక్రమంలో నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, ఎస్. రాయవరం వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, ముసలయ్య, సీనియర్ నాయకులు మధువర్మ, శివాజీరాజు, చేకూరి రాముడు, గొర్ల బాబూరావు, అద్దేపల్లి నూకినాయుడు, వెదుళ్ల బంగారి, ఎన్ వెంకటరాజు, పోచిన నరేష్, కే దుర్గబాబు, శ్రీనివాస్, దివాణం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు చర్యలు



దోమల నివారణ మందు పిచికారీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: సీజన్‌లో వ్యాధుల నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పొడవునా పేరుకుపోయిన తుప్పల తొలగింపుతోపాటు దోమల బెడద లేకుండా ఉండేందుకు ఆదివారం మూలపేటలో పిచికారీ పనులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూలపేట గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్యం నిర్వహణపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. వార్డు సభ్యులు యల్లపు హైమావతి నాయుడు, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి శ్రీనివాసరావు, పెద్దలు భీశెట్టి నాగేశ్వరరావు, యల్లపు రాజేశ్వరరావు, బొడ్డేడ ఆదికుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: స్థానిక సంతబయిల రామాలయం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. మునగపాకకు చెందిన డాన్ జిమ్ అధినేత పెంటకోట విజయ్, స్వాతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరానికి 121 మంది రోగులు హాజరుకాగా 32 మందికి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. విజయనగరానికి చెందిన వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్ అసిస్టెంట్ పైలా వెంకటలక్ష్మి సేవలందించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూక నరసింగరావు, దాడి శివ, పెంటకోట శ్రీరామమూర్తి, వేగి దేవతనాయుడు, దాడి భీమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

యూరియా ఇవ్వకుండా గ్రామసభలా?

వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆగ్రహం



వెంకటాపురం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: మండల వ్యాప్తంగా ఆదివారం యూరియా పంపిణీకి సంబంధించి నిర్వహించిన గ్రామసభల తీరుతెన్నులపై వైఎస్సార్‌సీపీ నాయకులతోపాటు రైతులు విమర్శలు గుప్పించారు. కొద్ది రోజులుగా యూరియా కొరతపై అటు రైతులు, ఇటు వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మండిపడుతూ వచ్చారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులపై బాహాటంగానే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం ఒకడుకు ముందుకేసి సచివాలయాల పరిధిలో మండల స్థాయి అధికారులతో గ్రామసభలు ఏర్పాటు చేసింది. ప్రతీ సచివాలయ పరిధిలోని రైతులకు అవసరమయ్యే యూరియాను అందుబాటులో ఉంచామని ఒకవైపు తహసీల్దార్ సత్యనారాయణ, మరోవైపు ఎంపీడీవో ఎం.ఉషారాణి, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి చెప్పుకొచ్చారు. గ్రామసభలకు హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు మాత్రం మునుపెన్నడూ లేని విధంగా యూరియా కొరత ఏర్పడిందని గతంలో రైతులకు అవసరమయ్యే ఎరువులను పుష్కలంగా అందుబాటులో ఉంచేవారని నిలదీశాయి. నేడు సుదూర ప్రాంతాలకు వెళ్లి యూరియా తీసుకోవాలంటూ అధికారులు చెప్పడం సమంజసం కాదని మెలిపాక సర్పంచ్ అయినంపూడి విజయ భాస్కరరాజు, టి.సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్‌లో ఎంతమేర ఎరువుల ఆవశ్యకత ఉందో గుర్తుంచుకొని ఇందుకు తగ్గట్టుగా సరఫరా చేయకుండా తూతూమంత్రంగా కొన్ని బస్తాలు అందజేసి చేతులు దులుపుకోవడం సరికాదంటూ వాపోయారు.

15 నుంచి ‘రణభేరి ప్రచార జాతా’



రణభేరి ప్రచార జాతా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం కొత్త పీఆర్సీ, బకాయిపడ్డ డీఏలు అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15న శ్రీకాకుళం జిల్లా సొంపేట నుంచి రణభేరి ప్రచార జాతా నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా సమావేశంలో జాతా కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావలసిన పీఆర్సీ, డీఏలు, ఆర్థిక బకాయిలు తదితర సమస్యల సాధన కోరుతూ ఈ నెల 15 నుంచి 19 వరకూ ఉత్తరాంధ్రలో జాతా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ జాతా శ్రీకాకుళం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా అనకాపల్లి జిల్లాకు ఈ నెల 18న మాడుగుల నియోజకవర్గానికి చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి బైక్ ర్యాలీగా అనకాపల్లి సీఐటీయూ కార్యాలయానికి చేరుకుని కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉపాధ్యాయులను చదువు చెప్పడానికి మాత్రమే ప్రభుత్వం వినియోగించుకోవాలని, పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని కోరారు. అస్తవ్యస్తంగా పునర్వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవలసిన రూ. 25 వేలకోట్ల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులకు బకాయిపడ్డ ఉద్యోగులకు పెన్షన్, గ్రాట్యూటీ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ మొదలగు బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. పీఆర్సీ అమలు చేసే వరకూ మధ్యంతర భృతిని అమలు చేయాలని కోరారు. ఈ నెల 25న విజయవాడలో భారీ రణభేరి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్యబాబు, కోశాధికారి జోగా రాజేష్, సీనియర్ నాయకులు రొంగలి ఉమాదేవి, ఎస్ ఎస్ నాగమణి, జీకేఆర్ స్వామి, అలివేలు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రూ.16,500 పలికిన వినాయక లడ్డూ



మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజుతో కలిసి నగదు అందిస్తున్న దృశ్యం

కోటవురట్ల: స్థానిక సీతారామరాజునగర్‌లోని బాల వినాయక యూత్ గణనాథుని లడ్డూ ప్రసాదానికి ఆదివారం వేలం నిర్వహించారు. స్వామి ప్రసాదాన్ని వేలంలో దక్కించుకునేందుకు స్థానికులు, యువకులు పోటీ పడ్డారు. చివరకు అదే వీధికి చెందిన సత్యనారాయణ, త్రినాథ్ పందు రూ.16,500 లకు దక్కించుకున్నారు. అనంతరం లడ్డూ ప్రసాదాన్ని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు వేలం విజేతలకు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏటా బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో గణనాథుని వేడుకలు వైభవంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మికత యువతను సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జానకి శ్రీను, స్థానిక పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

రెవెన్యూ రీ సర్వే తప్పులు సవరించాలని వినతి



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న వియ్యపు చిన్న

పరవాడ: మండలంలోని రావాడ గ్రామ పంచాయతీలో జరుగుతున్న రెవెన్యూ రీసర్వే తప్పులు తడకగా ఉందని, దీంతో రైతులు రెవెన్యూ పరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న ఆరోపించారు. ఈ మేరకు పరవాడ తహసీల్దార్ బి.నాగరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో రెవెన్యూ రీసర్వేలో సిబ్బంది రైతులకు చెందిన భూములను కాకుండా అదనంగా నమోదు చేయడం, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులతో రైతులను రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆక్షేపించారు. రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేయాలని, లేకుంటే సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. రీసర్వేలో జరిగిన తప్పుల్ని సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భరోసానిచ్చినట్లు చిన్న తెలిపారు.

‘యూరియా కొరత లేకుండా చర్యలు’



గణపర్తిలో రైతులకు యూరియా అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులను అందజేస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. మండలంలో ని చూచుకొండ, గణపర్తి గ్రామాల్లో ఆదివారం రైతులకు రాయితీపై యూరియా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి, చూచుకొండ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట నరసింగరావు, కాళ్ల చంద్రమోహన్, కోరపాటి రాజశేఖర్, మాధవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై గ్రామాల్లో అవగాహన

నక్కపల్లి/పాయకరావుపేట/ఎస్.రాయవరం/యలమంచిలి రూరల్: ఎరువుల వినియోగంపై గ్రామాల్లో వ్యవసాయ అధికారులు సభలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని రైతులకు సూచిస్తున్నారు. ఆదివారం నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, యలమంచిలి మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. మండల అధికారులు, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శిగా రాజేష్



రాజేష్

నక్కపల్లి: సీఐటీయూ జిల్లా కార్యదర్శిగా నక్కపల్లికి చెందిన మనబాల రాజేష్ ఎన్నికయ్యారు. ఆదివారం చోడవరంలో జరిగిన సీఐటీయూ జిల్లా మహాసభల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. చిన్న వయసులోనే ప్రజా సమస్యలపై ఇతను చేస్తున్న పోరాటాలను గుర్తించి జిల్లా సమావేశాల్లో ఎన్నుకున్నట్టు సీఐటీయూ వర్గాలు తెలిపాయి. రాజేష్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం దుర్గారాణి, నాయకురాలు సుబ్బలక్ష్మి, ఆటో యూనియన్ అధ్యక్షుడు పిక్కి శ్రీనివాస్, త్రినాథరావు, పలు కార్మిక సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.